క్లుప్తంగా

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

సత్తెనపల్లి: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి 28 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్వీవీ కుమార్ గురువారం తెలిపారు. పట్టణ, పరిసర గ్రామాల భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం సత్తెనపల్లి నుంచి అమరావతికి 10 బస్సులు, సత్తెనపల్లి నుంచి నరసరావుపేటకి 18 ప్రత్యేక బస్సులు శుక్రవారం తెల్లవారుజామున 4.00 గంటల నుంచి నడప బడతాయన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మొక్కపాడు(రాజుపాలెం): మండలంలోని మొక్కపాడుకు చెందిన రైతు అప్పుల బాధ తాళలేక పొలంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నానబాల నరసింహారావు(38) తన అర ఎకరంతో పాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిరప పంటలు సాగు చేశాడు. ఈ ఏడాది సాగు చేసిన పంట దిగుబడులు సరిగ్గా లేకపోవటంతో పాటు గతంలో చేసిన అప్పులు కూడా పెరిగాయి. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై తన పొలానికి వెళ్లి పొలంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రంతా బంధువుల ఇళ్ల వద్ద, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. తెల్లారిన తర్వాత పొలం వెళ్లిన బంధువులకు నరసింహారావు విగతజీవిగా కనిపించాడు. మృతునికి భార్య వెంకటరమణ, ఇద్దరు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. భార్య వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సమీర్‌బాషా తెలిపారు.

వైభవంగా లింగంగుంట్ల తిరునాళ్ల



పెదకూరపాడు: మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా లింగంగుంట్ల తిరునాళ్ల గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం యోగి వీరయ్య తాత జీవ సమాధి అయిన సందర్భంగా లింగంగుంట్ల తిరునాళ్ల నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలు మూల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభలు అలరించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకట్రావు ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు.

చలో అమరావతిని జయప్రదం చేయండి

క్రోసూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట గల బహిరంగ ప్రదేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు జరగనున్న వికలాంగుల మహాగర్జన సభను జయప్రదం చేయాలని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. క్రోసూరు మండలంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు చెందిన వికలాంగులందరూ తప్పక హాజరుకావాలని కోరారు. ప్రకటనలో జడ సుబ్బు, నందిగం దేవదాసు, రేపుడి ప్రభుదాసు, సిద్దెల దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మాచర్ల: మహాశివరాత్రి, సాగర్ మాత తిరునాళ్ల పురస్కరించుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ప్రారంభమయ్యాయి. రెండు వైపులా గురువారం మధ్యాహ్నం నుంచి బస్సులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శ్రీశైలంకు దాదాపు 15 బస్సులు పంపగా, సాగర్ మాత తిరునాళ్లకు 25 బస్సులు పంపారు. శుక్రవారం తేరాల, మన్నేపల్లి, సత్రశాలతో పాటు అనేక శివాలయాలకు ప్రత్యేక బస్సులు సాధారణ చార్జీలతో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈవీఎంలపై బీఎల్‌వోలకు అవగాహన

గురజాల : ఈవీఎంలపై ప్రతి ఒక్క బీఎల్‌వో అవగాహన కలిగి వుండాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌వోలు ఈవీఎంలను ఏ విధంగా ఉపయోగించాలి ఏమైనా సమస్యలు వస్తే ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాల గురించి సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

అక్క చెల్లెమ్మలకు ఆర్థిక దన్ను

- వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రా మహిళలకు అండగా ప్రభుత్వం
- నియోజకవర్గానికి 4 విడతలుగా రూ.151.56 కోట్ల నిధులు విడుదల
- 4,649 సంఘాల డ్వాక్రా రుణాల మాఫీపై లబ్ధిదారుల హర్షాతిరేఖాలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పట్టణ పొదుపు సంఘాలకు నమూనా చెక్కు అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు(ఫైల్)

సత్తెనపల్లి: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలబెట్టుకున్నారు. నాలుగు విడతల్లో రుణమాఫీ సొమ్మును మహిళా సంఘాల బ్యాంక్ ఖాతాలోకి జమ చేశారు. దీంతో మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడి తమ పరపతిని పెంచుకున్నాయి.

శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాక్షి కథనం..

సత్తెనపల్లి నియోజకవర్గంలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,649 స్వయం సహాయక సంఘాలలో 46,490 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరికి సంబంధించి 2019 ఎన్నికల సమయం నాటికి బ్యాంకుల్లో ఉన్న అప్పులు మొత్తాన్ని నాలుగు విడతల్లో రూ.151.56 కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశ్వసనీయతకు ఇదొక నిలువెత్తు నిదర్శనం.

నియోజకవర్గంలో లబ్ధి ఇలా..

మండలం	స్వయం సహాయక సంఘాలు	లబ్ధి (రూ.కోట్లలో)
సత్తెనపల్లి టౌన్	772	22.73
సత్తెనపల్లి రూరల్	1,318	43.66
ముప్పాళ్ళ	783	28.41
రాజుపాలెం	721	22.77
నకరికల్లు	1,055	33.99

ప్రభుత్వం అండగా నిలిచింది..



నేను యాసిన్ మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉంటున్నా. మా సంఘానికి సంబంధించి రూ.7,07,262 బకాయి ఉంది. ఈ మొత్తం నాలుగు విడతలుగా ప్రభుత్వం జమ చేసింది. దీంతో బకాయిలు మొత్తం తీరిపోయాయి. ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అన్ని విధాలా అండగా నిలిచింది.

–రహీం జానీ, డ్వాక్రా మహిళ, సత్తెనపల్లి

రూ.5.80 లక్షలు మా సంఘానికి లబ్ధి..



10వ వార్డు నాగార్జున నగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. ఎన్నికలకు ముందు అక్క చెల్లెమ్మల డ్వాక్రా రుణాలు నాలుగు విడతల్లో తీర్చుతానని జగనన్న హామీ ఇచ్చారు. చెప్పినట్లు ఇప్పటికి మూడు సార్లు వైఎస్సార్ ఆసరా నగదు బ్యాంకు ఖాతాల్లో వేశారు. ఇప్పుడు నాలుగో విడత కూడా నగదు విడుదల చేశారు. మొత్తం రూ.5.80 లక్షలు మా సంఘానికి లబ్ధి చేకూరింది. చాలా సంతోషంగా ఉంది.

–పల్లపు వనజాక్షి, డ్వాక్రా మహిళ, సత్తెనపల్లి

మాట నిలబెట్టుకున్న జగన్..



వినీల మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. అప్పట్లో తీసుకున్న రుణంలో కొంత తీర్చగా మిగిలిన రుణం తీర్చలేకపోయాం. జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.47,852 మా ఖాతాలో జమ చేశారు. నాలుగో విడత ఆసరా నగదు కూడా విడుదలైనట్టు మా ఆర్పీ చెప్పారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్‌మోహన్ రెడ్డికి తోడుగా ఉంటాం. నేను చిల్లర కొట్టు పెట్టుకొని జీవనం వెళ్లదీస్తున్నా.

–గుజ్జర్లపూడి ప్రభావతి, డ్వాక్రా మహిళ, సత్తెనపల్లి

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా..



ఉషోదయ మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉంటున్నా. గతంలో రూ.9,04,110 మా సంఘం సభ్యులందరం కలిసి రుణం తీసుకున్నాం. ఆ రుణం చెల్లించ లేకపోయాం. నాలుగేళ్లలో ఒక్కో మహిళకు రూ.90,411 చొప్పున రూ.9,04,110 మా గ్రూపు ఖాతాల్లో జమయ్యాయి. బట్టల వ్యాపారం చేసుకుంటూ జీవనం వెళ్ల దీస్తున్నా. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు అండగా నిలిచిన జగన్‌కు రుణపడి ఉంటాం.

–పల్లెపోగు అమృతమ్మ, డ్వాక్రా మహిళ, సత్తెనపల్లి

ఆలయాలకు శివరాత్రి శోభ

- ముస్తాబైన శైవక్షేత్రాలు
- నేడు మహాశివరాత్రి పర్వదినం



పట్టణంలోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం

సత్తెనపల్లి: శివరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. ఈ మేరకు ఇప్పటికే సంబంధిత దేవాలయ కమిటీలు, అధికారులు సన్నాహాలు చేశారు. కల్యాణోత్సవాలను కూడా ఏటా జరుపుతారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వరస్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంతో పాటు పట్టణం, మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అచ్చంపేటరోడ్ లోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 5 నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన చేపడతారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల దర్శనం, రాత్రి 1.05 గంటలకు స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ నెల 9న సాయంత్రం 6:35 గంటలకు మేళతాళాలు, కనక తప్పెట్లు, విద్యుత్ కాంతులతో అంగరంగ వైభవంగా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. అలాగే గుంటూరు రోడ్‌లోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో బాలత్రిపుర సుందరి సహిత మల్లికార్జున స్వామి వార్లకు కల్యాణం నిర్వహించడం జరుగుతుందని వంశపారంపర్య ధర్మకర్త, మఠాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ గురువారం తెలిపారు. గోవిందమాంబ సమేత వీరభద్ర స్వామివార్లకు, సనారి విశ్వనాథ స్వామి వార్లకు కల్యాణం జరుగుతుందన్నారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి లింగోద్భవ అభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బంగారుతల్లి కార్డులపై అవగాహన



పెదకూరపాడు: నేటి ఆరోగ్య వంతమైన బాలికే రేపటి సుసంపన్నమైన సమాజానికి సూచిక అని 75త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని 75త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాలలో గురువారం బంగారు తల్లి కార్డులపై, రక్తహీనత తక్కువగా ఉన్న కాశిపాడు, తమ్మవరం, 75త్యాళ్ళూరు గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి ఫలితాలను నమోదు చేశారు. పోషక ఆహారం అందించే విషయంలో తల్లిదండ్రులు రాజీ పడవద్దన్నారు. అనంతరం కార్డులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమావేశం

ముప్పాళ్ళ: మండల పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పీ రమాదేవి పాల్గొని గర్భిణులకు ప్రభుత్వం కల్పించిన ఉచిత స్కానింగ్ సౌకర్యంపై అవగాహన పెంచాలన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను బాలింతలు ఉపయోగించుకునేలా చూడాలన్నారు. ఆశ యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేస్తూ సక్రమంగా వినియోగించాలని సూచించారు. బాల్యవివాహాలపై నిఘా ఉంచాలని, వాటి వలన కలిగే అనర్థాలను వివరించాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్‌లు పీటర్ డేమియన్, జోస్పిన్ రాణి, ఆయా గ్రామాల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఉదయం 9 గంటలకు జరుగుతాయని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహాసంతి గురువారం తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఇతర మహిళా ముఖ్య నేతలు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని మహిళా సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, ఆశ వర్కర్లు, యానిమేటర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయినులకు సన్మానం



నకరికల్లు: మహిళలు అన్నిరంగాల్లోను పురుషులకు దీటుగా రాణిస్తున్నారని ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఫాహిం అన్నారు. మండలంలోని చేజర్ల గ్రా మ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఫాహిం, ఉపాధ్యాయినులు లలిత, మల్లికలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఉపాధ్యాయు లు గేరా మోహన రావు మాట్లాడుతూ విద్య, రాజకీయ, సైన్స్ తదితర అన్ని రంగాలలోను మహిళలు ముందంజలో ఉన్నారని అన్నారు. పలువురు ఉపాధ్యాయినులు మాట్లాడుతూ బాలికలను చిన్నచూపు చూడకుండా చదివిస్తే ఆసక్తి కలిగిన రంగంలో సత్తా చాటుతారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మస్తాన్‌వలి, వెంకట్రావు, బత్తుల సుందరరావు, హబీబ్, గౌస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న మురళీధర్‌రెడ్డి

గురజాల : పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో జగనన్న లే అవుట్‌లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి చేసి రిజిస్ట్రేషన్ పత్రాలను గురువారం సాయంత్రం లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే విడతలో ఇంతమందికి ఇంటి స్థలాలు అందించడం ఇదే ప్రథమమని గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా అందించలేదన్నారు. అర్హతను బట్టి సంక్షేమ పథకాలు అందించడంతో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మాజీ జెడ్పీటీసీ బి.ఇష్టకామిరెడ్డి, కౌన్సిలర్ యెనుముల దివ్యవాణి, వీరారెడ్డి తదితరులున్నారు.

పోలీసు వారికి సహకరించాలి

ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి

సత్రశాల(రెంటచింతల): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్రశాల వద్ద వేంచేసిన ప్రముఖ శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంకు తరలివచ్చే భక్తులు ప్రశాంతంగా దైవదర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన సత్రశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గురజాల, రెంటచింతల నుంచి వచ్చే వాహనాలకు మిట్టగుడిపాడు రోడ్డు మార్గాన అనుమతి లేదని వారు పాలువాయి జంక్షన్, పశర్లపాడు, జెట్టిపాలెం నుంచి సత్రశాల దేవస్థానానికి వెళ్లాలన్నారు. మూలమలుపుల వద్ద వేగంగా వాహనం నడిపి ప్రమాదం కొని తెచ్చుకోవద్దన్నారు. అన్నదాన సత్రాలకు సరుకులు ఇతర వస్తువులు తెచ్చుకునేందుకు పాస్‌లు ఉన్నవారు వారి వాహనాలను వారి సత్రాలలో మాత్రమే నిలుపుకోవాలన్నారు. దేవస్థానం వద్ద వాహనాలను నిలపరాదన్నారు. పాస్‌లు లేని భక్తులు పోలీసు వారు చూపిన పార్కింగ్ స్థలంలో మాత్రమే వాహనాలు నిలుపుకోవాలన్నారు. ఆటోలు పాలువాయి జంక్షన్ వరకు అనుమతించబడతాయన్నారు. ప్రశాంతంగా భక్తులు దైవ దర్శనం చేసుకుని పూజలు నిర్వహించి సంతృప్తితో వారి ప్రాంతాలకు తిరిగివెళ్లేలా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా విధులు నిర్వహించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

వాటర్ ట్యాంకర్ ఏర్పాటు

రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఏర్పడిన మంచి నీటి సమస్యను పరిష్కరించడానికి వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు, ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ తెలిపారు. సర్పంచ్ దావులూరి నాగమ్మ గ్రామంలో పలు కాలనీల్లో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో గురువారం ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, గ్రామ పెద్దలతో కలిసి వాటర్ ట్యాంకర్‌కు పూజలు నిర్వహించారు. తాగునీరు వృథా చేయవద్దని ట్యాంకర్ వచ్చిన సమయంలో ఘర్షణ పడకుండా నీరు పట్టుకోవాలని సూచించారు.

మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

- నేతి వెంకన్న ఆలయఅభివృద్ధికి కృషి చేశా
- రూ.1.20 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభంలో మంత్రి అంబటి



రెండంతస్తుల మండపం శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: పల్నాడు తిరుపతిగా పేరు గాంచిన నేతివెంకన్న స్వామి ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేపట్టామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని దేవరంపాడు గ్రామంలో వేంచేసియున్న నేతివెంకన్న స్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేడుకలు నిర్వహించుకునేలా చూడాలని, మంచినీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రూ.1.20 కోట్లతో దేవాలయ ముఖ మండపం, మెట్ల మార్గం నిర్మాణాలు చేపట్టామన్నారు. తిరునాళ్ల సమయంలో భక్తులు పొంగళ్లు చేసుకునేందుకు వసతులు కల్పించాలన్నారు. సాగర్‌జలాలతో దేవరంపాడు చెరువును పూర్తిగా నింపాలని ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఐదు వారాల పాటు జరిగే ఈ తిరునాళ్ల విజయవంతం చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ముందుగా రూ.21 లక్షలతో నిర్మించిన మెట్ల మార్గాన్ని, రూ.99 లక్షలతో నిర్మించిన ముఖ మండపం శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రామచంద్రరావు, ఆలయ కమిటీ చైర్మన్ శాఖమూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, దేవస్థానం ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఎస్.హరిబాబు, దేవదాయశాఖ డీఈ జనార్ధనరావు, దేవదాయశాఖ ఏఈ మాధవరెడ్డి, నాయకులు చంద్రమౌళి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ రూ. 26.76 కోట్లు

- ఏకగ్రీవంగా ఆమోదించిన పాలక వర్గం
- బడ్జెట్‌పై కౌన్సిలర్ల సందేహాలకు నివృత్తి



మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీతులసి



బడ్జెట్‌పై సందేహాలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్ తురకా మేరిగ్రేస్

సత్తెనపల్లి: పురపాలక సంఘ వార్షిక బడ్జెట్ రూ.26.76 కోట్లు ఖరారు చేస్తూ పాలకవర్గం ఆమోదం తెలిపింది. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో గురువారం పురపాలక సంఘ ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్తెనపల్లి పురపాలక సంఘానికి 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.26,76,10,831 అంచనాలు వేయగా గత ఏడాది ఈ పద్దు రూ.25,17,98,131కు చూపించారు. ఈ లెక్కన పరిశీలిస్తే రూ.1,58,12,700 ఆదాయం పెరిగింది. పట్టణాభివృద్ధి, ప్రజల సంక్షేమానికి పాలక పక్షం చేస్తున్న కృషికి నూతన బడ్జెట్ అనుగుణంగా నిధులు ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు చర్యలు చేపట్టేలా చూపారు. బడ్జెట్‌లో పలు అంశాలపై 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరీ గ్రేస్ సందేహాలను వ్యక్త పరచగా జూనియర్ అకౌంటెంట్ అనురాధ నివృత్తి చేశారు. 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్‌కుమార్ మాట్లాడుతూ ఏటా కోట్ల రూపాయల్లో బడ్జెట్ ప్రవేశపెట్టి ఆమోదించడం జరుగుతుందని, అయితే ఈ మేరకు పనులపై క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదన్నారు. ముఖ్యంగా కాలువల్లో చెత్త, చెదారం పేరుకుపోయి ఉంటుందని, దుర్గంధం వెదజల్లుతూ దోమలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. పురపాలక సంఘానికి కూతవేటు దూరంలో ఉన్న వార్డుల్లో కాలువలు అధ్వానంగా ఉంటున్నాయన్నారు. 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివ ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ కార్మికులు సమ్మె చేయడంతో అక్కడక్కడ కొంత ఇబ్బంది ఉన్న మాట వాస్తవమేనని, అయితే ప్రణాళికాబద్ధంగా పట్టణంలోని అన్ని వార్డులను శుభ్రం చేయడం జరుగు తుందన్నారు. ఈ సందర్భంగా బడ్జెట్ ఆమోదిస్తున్నట్లు ఆయన ప్రకటించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివ రావు, కౌన్సిలర్లు, సెక్షన్ హెడ్లు పాల్గొన్నారు.

వైద్యుడి నుంచి రక్షణ కల్పించాలని వినతి

ముప్పాళ్ళ: మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న ఆశ కార్యకర్తలు పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ నుంచి రక్షణ కల్పించాలంటూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని నరసరావుపేటలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో కలిసి తమ సమస్యలను మొరపెట్టుకొని వినతిపత్రం అందించామని మండల ఆశ వర్కర్ల సంఘం సభ్యులు గురువారం తెలిపారు. వైద్యులు జయకృష్ణ నుంచి ఇబ్బందులు పడుతున్నామని, తన వ్యక్తిగత పనులు చేయకుంటే ఉన్నతాధికారులకు చెప్పి విధుల నుంచి తొలగిస్తానని బెదిరిస్తున్నాడని వారు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సబ్‌సెంటర్‌లోనే ఉండాలని, ఆ తర్వాతే ఫీల్డ్‌కు వెళ్లాలని చెబుతున్నాడని, ప్రభుత్వం అందించిన ఫోన్‌లు పనిచేయకపోతే కొత్త ఫోన్‌లు కొనుగోలు చేసి పనులు చేయాలంటూ తమ పట్ల చిన్నచూపు చూస్తున్నాడని తెలిపారు. ఆశ యాప్‌తో పాటు ఏఎన్‌ఎంల యాప్‌లు కూడా ఫోన్‌లో ఎక్కించి పని చేయాలని, లేకుంటే జీతంలో కోత విధిస్తానని, తాను తిన్న అన్నం ప్లేటుతో పాటుగా క్యారియర్ సైతం కడగాల్సిందేనని, సబ్‌సెంటర్‌లో క్లీనింగ్ పనులు కూడా మేమే చేయాలని ఆదేశిస్తున్నాడని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలోను అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, అమర్యాదగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, వైద్యాధికారి జయకృష్ణ నుంచి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఎంహెచ్‌వోకు వినతి పత్రం అందించారు. మండల ఆశ వర్కర్ల యూనియన్ సభ్యులు ఎస్.సుజాత, పి.రమీజ, జి.సుశీల, ఎస్.పద్మ, ఇ.రోజ, డి.రాధిక, కె.లావణ్య, యు.మల్లీశ్వరి, ఆర్.సాంబ్రాజ్యం, గ్రామాల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు



ఇంటి పట్టాలు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్

పిడుగురాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నారని పట్టణ మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని 23వ వార్డులో గాంధీనగర్ నీళ్ల ట్యాంక్ సమీపంలో గురువారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. వలంటీర్ల ద్వారా సర్వే నిర్వహించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులైన మహిళలకు ఇంటి పట్టాలు అందిచారు. మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్, జేసీఎస్ ఇన్‌చార్జి జూలకంటి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కొత్త పుష్పలత, జడ సురేంద్ర, అన్నెం బంగారురెడ్డి, వార్డు కన్వీనర్ బత్తుల నాగిరెడ్డి, సచివాలయ అడ్మిన్లు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.